

# పశ్చాత్తాపము

వంగూరి నరసింహారావు

అది ఒక వసంతదినము. సాయంత్రం ఏడుగంట లైనది. పూనా నగరంలో ఒక దివ్య భవనపు రెండవ అంతస్తు డాబామీద చంద్రిక వీణ వాయిస్తూ మధురంగా గానం చేస్తోంది. ఎదుట వాలు కుర్చీలో మోహనరావు సుఖాసీనుడై ఆనందిస్తున్నాడు. అప్పుడే చల్లగాలి తిరిగి హాయిగా వీస్తోంది. చంద్రిక ముంగురులు గాలికి ఎగురుతూ ఉంటే మోహనుడు సవరిస్తున్నాడు. కొంతసేపటికి

మోహ:—చంద్రికా! యీ పట్టున నీ భర్త వస్తే ఏం చేస్తావు?

చంద్రిక:—మర్యాద చేస్తాను. కూర్చో మంటాను. నా సుఖంకోసం నే నిట్లా మీతో చెప్పకుండా వచ్చా నంటాను. నాతప్పేమీ లేదంటాను. బిడ్డని తీసికొని పోతానంటే మహా సంతోష మంటాను. అంతే కాని అణు మాత్రైనా నిన్ను వదలి పోతాననా నిశ్చయం.

మోహ:—అట్లాంటి అనుమానం ఎప్పటికీ లేదు. పోదు లోకొని కింకా భయపడతా నంటావేమోనని అడిగాను. భర్త అంటే ఇంకా ఏమన్నా పూర్వపు మమకారం లేశమున్నా వుందేమోనని అడిగాను. అంతేకాని నీమీద నమ్మకమే లేకపోయినా నువ్వే నా ప్రాణాధికవని భావించకపోయినా, అరవై ఎకరాల సుక్షేత్ర ఖండమున్నా, అయినకాడికి తెగనమ్మి అడవి మృగంలా నీవెంట బడి అన్యదేశం రాగలనా! పైగా నా ప్రేమ సంపూర్ణంగా నీకు నైవేద్యం చేసినప్పుడు నీ ప్రేమ మాత్రం నాకు సమర్పించ వనుకుంటానా!

చంద్రిక:—ప్రియా! నేను నీకంటె ముందే నీకు నా ప్రేమార్పణం చేశాను. లేకపోతే ఆ అనాగరకపు దేశం విడిచి, లోకాపవాదాలకు తెగించి, సద్వంశాలని పేరు కెక్కిన పుట్టింటినీ, అత్తింటినీ కూడా వదలి, నీకోసం కేవలం నీ ప్రేమకోసం—ఇట్లా రాగలనా? వెనుకటి చంద్రికను కాను. కేవలము క్రొత్త చంద్రికను. నా కింతవరకును పరమ శత్రువులైన, అత్తిల్లనే కూపము—అనాకారి భర్త—అంతులేని దరిద్రము—ఆనంద లేశ మైన లేని అపాత్రపు సంసారమును—ప్రేమమూర్తివిని—నా పెన్నిధివిని ఐన నీ మూలమున పటాపంచ లైనై—ఇప్పుడు నా మనోహరుని యెదుట—నేను మనసార వలచిన నా ప్రేమమూర్తి యెదుట, సర్వ సౌఖ్యాలు అనుభవిస్తున్నాను. నా జీవితంలో యింత కంటె సౌఖ్యపు దినా లుండబోవు. ఇప్పుడు నా హృదయం స్వేచ్ఛావిహారం చేస్తోంది. నేను కష్టాలచేత చిదికి పోయినా యిప్పుడు మోడైన నా జీవితలత తిరిగి చిగిర్చి పుష్పిస్తోంది. నాలో యిప్పు డొక నూతన వికాసం

కలిగి నాట్యం చేస్తోంది. నేను పూర్తిగా ఒక క్రొత్త చంద్రికనే! కాదూ? మోహనా!

మోహ:—చంద్రికా! నీవంటి దివ్య మోహనమూర్తి,—నీవంటి మనోహర వీణా గాయకురాలు—నీవంటి ప్రేమ నిలయము—నాకు లభించుట నా పూర్వజన్మ సుకృతమే సుమా! ఏదీ రుచులీనే ఒక ముద్దు—అని మోహనుడు చంద్రికను గాఢాలింగనం చేసికొని తియ్యటి చుంబన సుఖం అనుభవించాడు. నీకు సమయా సమయాలు లేవు సుమా, మోహనా—అంది చంద్రిక. ఇటువంటి వాటికి సమయా సమయాలేమిటి అన్నాడు మోహనుడు. సుకుమారం నేర్చుకుందూ మోహనా అంది చంద్రిక. ఇట్లాంటి మన్మథ విహారాలలో అమను దొరకటం చూచుకోవటమే కాని, సుకుమార మోటుతావాలాలోచించటానికి అవకాశం వుండను సుమా అన్నాడు మోహనుడు. పక్కున నవ్వింది చంద్రిక. చంద్రికే నవ్వితే తనకికూడా నవ్వొచ్చింది కాబోలు చటుక్కున చంద్రుడుకూడా నవ్వాడు.

మరునాడుదయం మెయిలులో చంద్రిక అసలు భర్త వెంకటచలం, వేంచేశాడు. వెంకటచలం పాపం సాధు వర్తనుడు. పదేండ్లక్రితం అతడూ గొప్ప ఆస్తిపరుడే! కాని, కాలచక్రం! ప్రస్తుతం అతనికి లక్ష్మీ కటాక్షం తప్పిపోయింది. కారణం చాలవరకు చంద్రికాదేవిగారి విలాస జీవితానికైన ఖర్చులే! ఇక కథాంశానికి దిగుదాం.

అతడు వచ్చే సరికి, చంద్రిక మోహనరావు పెదవులకు తీయని తేనె రందిస్తోంది. చంద్రిక కూతురు కొంచె మవతల పాలకొరకేడుస్తూంది. ఈ దృశ్యం చూచేసరికి వెఱ్ఱి వెంకటచలం గుండె నీరైపోయింది. అతడే గాలివార్త విని వచ్చాడో అది సత్యమని ప్రత్యక్షంగా "చూడ రండే కళ్లనిపించు నారాయణా" అన్నట్లు చూచాడు. కోపము, విచారము, జాలి, వైరాగ్యము, ఇవన్నీ ఒక్కసారి అతని హృదయాన్ని వరించాయి. తిన్నగా వెళ్ళి ఏడుస్తూవున్న బిడ్డ నెత్తుకున్నాడు. తిరిగి గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. కూలివాడి నెత్తిమీద సామానింకా దింపనైనా లేదు. ఈ మాట అతని నోటినుండి వెలువడినై.

"చంద్రికా! ఇచ్చటనైనా నీవు సుఖ మనుభవించుచున్నందుకు నాకు సంతోషమే! నాబిడ్డను నేను తీసికొని పోవుచున్నాను." అని బిడ్డ ముఖంకేసి అప్రయత్నంగా చూచాడు. బిడ్డ ఏడ్పు మానింది. కాని ఇంకా చెక్కిళ్లమీద అశ్రుబిందువులు ముత్యాలల్లే మెరుస్తున్నాయి. అప్రయత్నంగా రెండు వేడి కన్నీటి బిందువులు వెంకటచలం కళ్లనుండి జారాయి. గిరుక్కున తిరిగి వెంకటచలం మేడ మెట్లు దిగిపోయాడు. చంద్రికకుకూడా కను లశ్రుపూరితము లయినాయి.

"శని వదిలింది. ఇక మనకు బిడ్డ అడ్డంకూడా లేదు" అన్నాడు మోహనుడు మందహాసం చేస్తూ.

అతన్ని ఆనందింప జేయడానికి, చంద్రికకూడా కృత్రిమ మందహాసం చేసింది. కొంతసేపటికి గుండె రాయి చేసుకుంది, బిడ్డపైన ప్రేమకూడ మోహనునిపై ప్రేమకు దిగమడుపు పెట్టింది. సుఖంగా కాలం గడుపుతూంది.

ఒక పుష్కరం గడిచింది. ఒకనాడు సాయంత్రం మద్రాసు తిరువళిక్కేణి మెరినా బీచిదగ్గర ఒక చక్కని 1934 మోడల్ ఫోర్డ్ కారు నిలిచివుంది. దానిలో 13 సం॥ రముల బాలిక ఒకతె, సుఖాసీనురాలై వుంది. డ్రైవరు కొంచెము ప్రక్కగా రోడ్డు చీడీపై కూర్చుని జింఖానా సిగరెట్టు పీల్చుకుంటున్నాడు. రేడియో గానమున్నూ, చల్లని సముద్రపు గాలిన్ని కారులో కూర్చున్న




ఆ పిల్ల హాయిగా అనుభవిస్తోంది. ఆ పిల్ల సౌందర్యం వర్ణించడానికి మా కలానికి శక్తిలేదు. అంతటి నిరుపమాన సౌందర్యవతి ఆ పిల్ల. ఆ విలువైన కారు—ఆమె

నుస్తులు—ఆభరణాలు—వగైరాలు చూస్తే ఆ పిల్ల ఒక గొప్ప ధనికుని కూతురువలె కనిపిస్తోంది.

ఇంతలో ఆ కారుదగ్గర కొక భిక్షుకురాలు వచ్చింది. ఆమె వయస్సు సుమారు 35 సం॥ము లుండును. కాని తొంభై ఏండ్ల ముసలివలె వుంది. నడచుటకైనా ఓపిక లేదు, పాపం నోట మాట్లాడుటకైన శక్తిలేదు. "అమ్మా! రెండు రోజులనుంచి తిండిలేదు. ఒక్క కాని ధర్మం చెయ్యమ్మా! నీకు పుణ్య ముంటుంది." అని దీనంగా ఆ బాలిక నడిగింది భిక్షుకురాలు. ఆ బాలికను జాలివేసి ఒక అణా ఆ భిక్షుకురాలి చేతిలో వేసింది. అప్పుడా బాలిక బంగారు చేతిపై నెర్రని పుట్టు మచ్చ, ఆ భిక్షుకురాలి కళ్ల బడింది. తెల్లబోయి గద్గదస్వరంతో "అమ్మా! నీపేరు" అని అడిగింది. నాపేరు "సుశీల" అంది బాలిక. "మీవూరు" అంది తిరిగి భిక్షుకురాలు. "హేలాపురము" అంది బాలిక. "హా! విధీ!" అంటూ నేలమీద పడిపోయింది భిక్షుకురాలు.

ఇంతలో ఆ బాలిక తండ్రి బీచినుండి కారుకడకు వచ్చి కారులో కూర్చుండబోతూ "ఎవరీమనిషి" అని బాలిక నడిగాడు. జరిగిన సంగతి బాలిక చెప్పింది. వెంకటచలం వెంటనే భిక్షుకురాలికడ కేగి, ముఖం పరిశీలనగా చూచాడు. అతని కళ్లనుండి అశ్రుధారలు కారాయి. బాలిక తెల్లబోయింది. "నాయనా! ఎందుకు విచారిస్తా"రంది. "సుశీలా! ఈ భిక్షుకురాలే నీ తల్లి!" అని వెంకటచలం విలపించాడు పాపం. ఇంతలో భిక్షుకురాలికి తెలివి వచ్చింది. భిక్షుకురాలితో సహా కారులో బైలుదేరి మైలాపూరులో శాంతి సదనం చేరారు వెంకటచలం సుశీలయును. భిక్షుకురాలికి సుఖస్నానం చేయించి శుభ్ర వస్త్రాలు ధరింపజేసి, భోజనానంతరం హాలులోనికి పిలిపించాడు వెంకటచలం. సుశీలకూడా తండ్రి ప్రక్కనే కూర్చుంది. చంద్రిక లజ్జావనతవదనంతో వచ్చి నిలబడింది.

వెంక:—చంద్రికా! కాలచక్రం ఎప్పుడూ తిరుగుతూ వుంటుందనిన్నీ, ఐహిక సుఖా లనిత్యాలనిన్నీ, సత్ప్రవర్తనమే ఇహ పర సాధనమనిన్నీ ఇప్పటికైనా తెలిసినదా! నాకు నీపై లేశమైనా కోపము లేదు. నీ స్థితికి నేను మిక్కిలి జాలిపడుచున్నాను. నా ప్రేమ నిర్మలమైనది. నేను నిన్ను పూర్తిగ ప్రేమించితిని. నీవు మాత్రము ధన మున్నన్నినాళ్లు నాపై కృత్రిమప్రేమతో నుండి, ధనహీనుడను కాగానే పరుల నాశ్రయించి, ధనము కొరకు వారిపై కృత్రిమ ప్రణయ వర్షము కురిపించి, తుద కిట్లైతివి. నేను మాత్రము నాటినుండి నేటివరకు మరొక కాంతను కన్నెత్తి చూడలేదు. నా సర్వస్వమును యీ బాలికయే యని చూచుకొని జీవించుచున్నాను. పరమేశ్వరుడు నా స్వచ్ఛంద జీవితానికి సంతసించాడు. లక్ష్మీదేవి తిరిగి నా బాలికపై తన కటాక్ష వీక్షణాలు ప్రసాదించింది. నా బాలిక పేర వేసిన డర్బీ స్వీపులో లక్షరూపాయలు వచ్చినై. ఈ ఐశ్వర్యమంతా అదే! నీవుకూడా యింక నీ బాలికను—మన బాలికను—చూచుకుంటూ—పూర్వ జీవితానికి పశ్చాత్తాప పడుతూ—పరమేశ్వరుని క్షమింప వేడుతూ—శేష జీవితాన్ని గడుపుకో! నీకే లోటును లేదు. నే నిదివరకే ఋషినైనాను. నీవును ప్రాణమాత్రావశేషవుగా నున్నావు. మన యిరువురకును పరమేశ్వర పాదారవింద సేవయే పరమావధి!



చంద్రిక తిరిగి పూర్తిగ మారిపోయినది. భర్త పాదములపై బడి అశ్రుధారలతో నాతని పాదములు కడిగినది. వెంకటచలముకూడ అశ్రుపూరితలోచనుడై ఆమెనోదార్చి లేవనెత్తాడు. చంద్రిక సుశీలను కౌగలించుకొని పరితపించింది. తనివితీర ముద్దాడింది. పన్నెండేండ్ల ఎడబాటును ఒక్కసారి తల్చుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. కొంతసేపటికి శాంతించింది. కొన్నాళ్లకి చంద్రికా వెంకటచలములు శాంతి సదనోద్యానవనంలో విహరిస్తూ "ఏమి శాశ్వత మేమి జీవనము" అని పాడుతూ వుంటే మేము విన్నాము.